


డిఎస్‌సిలో మెరిసిన అభ్యర్థులు

ప్రజాశక్తి-వీరఘట్టం

డిఎస్‌సి ఫలితాల్లో వీరఘట్టం మండలానికి చెందిన అభ్యర్థులు సత్తాచాటారు. విక్రమపురం గ్రామానికి చెందిన లెంక చక్రపాణి హిందీ పండిట్ (స్కూల్ అసిస్టెంట్)లో జిల్లా స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించారు. వీరఘట్టం గ్రామానికి చెందిన చీర సోమేశ్వరరావు స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ)కు సంబంధించి ఆరో ర్యాంకు సాధించారు. కిమ్మి గ్రామానికి చెందిన శ్రీకాంత్, బిటివాడ గ్రామానికి చెందిన పైల సన్యాసినాయుడు పిఇటిలో ఆరు, పదో ర్యాంకులు సాధించి, సత్తా చాటారు. దీంతో ఆయా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వారికి అభినందనలు తెలిపారు.

టిడిపికి ఫ్లోర్‌లీడర్ బైబై?

- రాజీనామా యోచనలో లక్ష్మోజీ?
- అదే బాటలో మరికొందరు నాయకులు
- మంత్రి తీరుపై అసంతృప్తితోనే!

ప్రజాశక్తి-సాలూరు

టిడిపి మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ తర్లాడ లక్ష్మోజీ పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. లక్ష్మోజీ గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఒకప్పుడు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి సన్నిహిత అనుచరుడైన లక్ష్మోజీ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండడం పట్టణ రాజకీయాల్లో చర్చనీయాంశమవుతోంది. లక్ష్మోజీ 23వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైన తర్వాత మున్సిపల్ కౌన్సిల్‌లో ఫ్లోర్‌లీడర్‌గా ఎన్నికయ్యారు. పట్టణంలో ఇటీవల నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొనలేదు. 23వ వార్డులో మంత్రి సంధ్యారాణి పర్యటించినప్పుడు కూడా ఆయన్ని ఆహ్వానించిన దాఖలాలు లేవు. మంత్రి సంధ్యారాణి కూడా ఆయన్ని దూరం పెట్టడం, లక్ష్మోజీ కూడా దూరంగా ఉండడం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశమైంది. మరో ఆరు నెలల్లో మున్సిపల్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో పట్టణ పార్టీ చుక్కాని లేని నావలా తయారైందనే వాదనలు వినిపిస్తున్నాయి. మంత్రి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో అధికారపార్టీ పరిస్థితి ఈవిధంగా తయారవడానికి ఆమె వ్యవహార శైలిపై అసంతృప్తే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. తనకు నచ్చిన నాయకులను, కార్యకర్తలను పక్కన పెట్టుకోవడం, నచ్చని వారిని దూరంగా పెట్టడంపై పార్టీ శ్రేణుల్లో అసంతృప్తికి ఆజ్యం పోసింది. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తర్లాడ లక్ష్మోజీ ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులో ఆయన్ని దూరం పెట్టి కొత్త నాయకుడిని తయారు చేసే పనిలో ఆమె ఉన్నారనే ప్రచారం సాగుతోంది. ఇదే తరహాలో మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లోనూ ఆమె ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వివాదాస్పద మవుతోంది. రాజకీయాల్లో ఏ మాత్రమూ అనుభవం లేని కొత్త నాయకులను ప్రోత్సహిస్తూ, సీనియర్ నాయకులను కరివేపాకుల్లా వినియోగించుకుని పక్కన పెట్టడంపై నివురు కప్పిన నిప్పులా అసంతృప్తి గూడుకట్టుకుని ఉంది.



టిడిపి మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ లక్ష్మోజీ

మండల నాయకుల్లోనూ అసంతృప్తి

మంత్రి సంధ్యారాణి వ్యవహార శైలి నచ్చక నియోజకవర్గంలోని మండల నాయకులు కొంతమంది అసంతృప్తితో రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. పాచిపెంట మండలంలో పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న పిన్నింటి కుటుంబాన్ని మళ్లీ పక్కన పెట్టడం పార్టీ శ్రేణుల్లో అసంతృప్తికి బీజం వేసింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్ బాబును ఏకపక్షంగా పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించడంతో ఆయన అనుచరులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ప్రసాద్ బాబు అనారోగ్యంతో బాధపడుతున్నా ఆయన తండ్రి పిన్నింటి ఈశ్వరరావును పార్టీ అధ్యక్షుడిగా పరిగణనలోకి తీసుకోకపోవడంపై ఆయన అనుచరులు అసంతృప్తికి గురయ్యారు. నిన్న మొన్నటి వరకు మంత్రి సంధ్యారాణికి సన్నిహిత అనుచరుడిగా వ్యవహరించిన మక్కువ మండల సీనియర్ నాయకుడిని కూడా ఆమె పక్కన పెట్టడం చర్చనీయాంశమైంది. మండలంలో అన్నీ తానై నడిపించిన ఆ సీనియర్ నాయకుడు ఇప్పుడు మంత్రి వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. ఇటీవల టిడిపి మండల నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆ సీనియర్ నాయకుడు గోడు వెళ్లగక్కినట్లు సమాచారం. తాను చెప్పిన పనులు మంత్రి సంధ్యారాణి చేయడం లేదని, తాను నోరు తెరిస్తే రాజకీయాలు తారుమారవుతాయని ఆ సీనియర్ నాయకుడు తన సన్నిహితులతో చెప్పినట్లు తెలిసింది. ఆయన స్థానంలో కొత్త నాయకుడిని తయారు చేసే పనిలో మంత్రి ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా ఇప్పటికే మక్కువ మండలంలో మరో గ్రూపు నాయకులు పార్టీ కార్యక్రమాలకు అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సాలూరు, మెంటాడ మండలాల్లోనూ అధికార పార్టీలో గ్రూపు రాజకీయాలు నెలకొన్నాయి. వాటిని నియంత్రించి గ్రూపులను ఏకం చేసే ప్రయత్నాలను మంత్రి సంధ్యారాణి చేయకపోవడంపై పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

తీవ్రంగా ఎరువుల కొరత

- యూరియా, డిఎపి సరఫరా చేయాలి
- ఎపి రైతు సంఘం డిమాండ్
- 28న కలెక్టరేట్ వద్ద ధర్నాకు పిలుపు

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని, డిఎపి, యూరియాకు బదులుగా నానో యూరియా, నానో డిఎపిని రైతులకు అంటగడుతున్నారని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు విమర్శించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనను విడుదల చేశారు. సంక్షేమం కోసం ప్రభుత్వ ప్రకటనల ఆర్భాటం తప్ప ఆచరణలో లేదని చెప్పారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతులకు సరిపడా ఎరువులు, యూరియా అందడం లేదని పేర్కొన్నారు. సరిపడా ఎరువులు ఇవ్వకపోగా, పైగా పురుగు మందులు కూడా తప్పకుండా తీసుకోవాలని డీలర్లు ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. రూ.266.50 యూరియాను బ్లాక్ మార్కెట్లో రూ.500 నుంచి రూ.600 వరకు అమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

గతంలో యూరియా, డిఎపి ఎరువులను రైతులే పొలాల్లో జల్లుకొనేవారని తెలిపారు. నానో యూరియా, డిఎపిలను స్ప్రే చేయాలంటే ఎకరాకు 10 ట్యాంకులు వెయ్యాలని, ఒక ట్యాంకుకు రూ.30 చొప్పున రూ.300 వరకు స్ప్రే చేయడానికి రైతు ఖర్చు చేయాల్సి వస్తోందని చెప్పారు. అది కూడా పని చేయడం లేదని చాలా రైతులు అనుమానంతో ఆందోళనకు గురవుతున్నారని, వాటిని నివృత్తి చేసే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలో రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం యూరియా, డిఎపి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈ నెల 28న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు రైతులంతా కదలిరావాలని పిలుపునిచ్చారు.



కొటికిపెంట నిర్వాసితులతో మాట్లాడుతున్న నాయకులు ఎం.కృష్ణమూర్తి

పెద్దగెడ్డ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం నాయకులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి-పాచిపెంట

పెద్దగెడ్డ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం రాష్ట్ర నాయకులు ఎం.కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మండలంలోని కేసలి, కొటికిపెంట గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. పెద్దగెడ్డ నిర్వాసితులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితులు నేటికీ తీవ్రమైన ఇబ్బందులు పడుతూనే ఉన్నారని తెలిపారు. ఎంతోమందికి సాగునీరు అందించి స్ఫూర్తినిచ్చి ఎన్నో త్యాగాలు చేసిన నిర్వాసితుల సమస్యల పట్ల పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కొటికిపెంటలో నిర్వాసితులందరికీ ఇళ్ల నిర్మాణం చేపట్టి, పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం గ్రాంట్ పెంచి, నిర్వాసితులకు ప్రత్యేకంగా ప్యాకేజీ ఏర్పాటు చేయకపోతే వారు అక్కడి నుంచి కదిలే పరిస్థితి లేదన్నారు. అక్కడ జ్వరాలతో ఎంతోమంది మంచానపడి వైద్యం చేయించుకోలేక, బతకడానికి అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసలి గ్రామంలో కూడా అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు నిర్వాసితుల ఇళ్ల నిర్మాణంపై దృష్టిపెట్టి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బోను గౌరినాయుడు, నిర్వాసితుల సంఘం నాయకులు సలాది సత్యనారాయణ, బి.వసంతరావు, సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెసి శోబిక, అధికారులు

టంగుటూరికి ఘన నివాళి

ప్రజాశక్తి-పార్వతీపురం

టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక పూలమాలను వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పని చేశారని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమ పోరాటంలో బ్రిటిష్ తుపాకీకి ఎదురునిలిచి గుండె చూపిన ధైర్యశీలి అన్నారు. అకుంఠిత ధైర్యసాహసాలకు, అసమాన త్యాగనిరతికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన టంగుటూరి ప్రకాశం పంతులు నేటి తరానికి ఆదర్శమని ఆమె ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయంలోని పలు విభాగాల పర్యవేక్షకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : జిల్లా పోలీసు కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి ఎస్‌పి మాధవరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, ఎస్‌బి సిఐ సిహెచ్.రంగనాథం, డిసిఆర్‌బి సిఐ ఆదాం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలో నడుకూరు, బొడ్లపాడు గ్రామాల్లో జనసేన నాయకులు ఎం.పుండరికం, జనసేన జానీ.. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సురవరం మృతి.. వామపక్ష ఉద్యమానికి లోటు

ప్రజాశక్తి-పార్వతీపురం

సిపిఐ సీనియర్ నేత సురవరం సుధాకర్ రెడ్డి మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు విచారం వ్యక్తంచేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ తరపున సంతాపం తెలియజేశారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ఆయన మాట్లాడారు. సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి దశ నుంచి పేదలు, కష్టజీవుల తరపున పోరాటాలు చేశారని చెప్పారు. 1998, 2004లో వామపక్షాల అభ్యర్థిగా నల్గొండ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పార్లమెంటు సభ్యులుగా గెలుపొంది, ప్రజల సమస్యలపై గళం వినిపించారని తెలిపారు. 2012 నుంచి 2019 వరకు సిపిఐ ఆలిండియా ప్రధాన కార్యదర్శిగా ఉంటూ వామపక్ష ఉద్యమాలకు ఊపిరి పోసారని అన్నారు. 2000 సంవత్సరంలో విద్యుత్ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఆయన మరణం దేశంలో వామపక్ష ఉద్యమాలకు లోటని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర ఉన్నారు.

పార్వతీపురం : సిపిఐ సీనియర్ నేత సురవరం సుధాకర్ రెడ్డి మృతి దేశానికి తీరని లోటని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దళిత, గిరిజన, బలహీన వర్గాల ప్రజల కోసం సురవరం నిరంతరం పోరాటం చేశారని వివరించారు.

పాలకుల తీరుపై విసిగి వేసారి..

గుమ్మడిగెడ్డ కాలువలో స్వచ్ఛందంగా పూడిక తీసుకున్న రైతులు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో గుమ్మడిగెడ్డ కాలువ ద్వారా సుమారు 300 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. కాలువ పరిధిలో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమైనా అధికారులు నిర్లక్ష్యం వహించి కనీసం పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్ పనులు కూడా చేపట్టలేదు. గత్యంతరం లేక గోలవలస, గుజ్జుపాడు, చెక్కవలస, పాలెం ఈదరవలస, కర్లగండ, కుంబికోట గ్రామాల రైతులు స్వచ్ఛందంగా కొంతనగదును పోగు చేసుకున్నారు. శనివారం జెసిబి పెట్టుకుని కాలువలో పూడిక తొలగించి, జంగిల్ క్లియరెన్స్‌ని చేపట్టారు. ఎంతమంది పాలకులు, అధికారులు మారినా తమ గోడు వారికి అవసరం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కేవలం ఎన్నికల ముందు గుమ్మడిగెడ్డ మినీ రిజర్వాయర్ కడతామని హామీలు ఇస్తున్నారు తప్ప అమలు చేయడం లేదని, కనీసం కాలువలో పూడిక తీత కూడా చేపట్టక పోవడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుమ్మడిగెడ్డ మినీ రిజర్వాయర్ నిర్మించి రైతులకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.





పూడిక తీయకముందు గుమ్మడి గెడ్డ కాలువ : పూడిక తొలగిస్తున్న పొక్లెయినర్

జనపనారకు కనీస మద్దతు ధర

ప్రజాశక్తి-పార్వతీపురం

2025 - 26 సీజన్‌లో పండించిన ముడి జనుము, మెస్తా/బిమ్లిలోని వివిధ తరగతులకు కనీస మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. జ్యూట్ టిడి-1 (డబ్లు-1, టిడి-3, +700) టోస్సా, వైట్ రకానికి క్వింటాకి రూ.6,350, టిడి-2 (డబ్ల్యు-2, టిడి-3,+500)కి రూ.6,150, టిడి-3 (డబ్ల్యు-3) రకానికి రూ.5,650, టిడి-4 (డబ్ల్యు-4, టిడి-3, -525)కి రూ.5,125, టిడి-5 (డబ్ల్యు-5, టిడి-3,-775) రకానికి రూ.4,875 మద్దతుధర ప్రకటించిందని చెప్పారు. మెస్తా/బిమ్లిలకు ఎం1 (ఒ.టిబిపి) రకానికి క్వింటాకి రూ.4,135, ఎం2 (ఎస్.ఎంఐడి) రకానికి రూ.3,985, ఎం3 (ఎంఐడి) రకానికి రూ. 3,860, ఎం4 (బిఒటి) రకానికి రూ.3,760, ఎం5 (బి.బిఒటి) రకానికి రూ.3,660, ఎం6 (ఎక్స్.బిఒటి) రకానికి రూ. 3,560 ధర ప్రకటించినట్లు తెలిపారు. జనపనార రైతులు ఈ ధరలకు విక్రయించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-సాలూరు రూరల్


సాలూరులో ఆదివారం జరిగే మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సాలూరు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.శంకర్, టి.రవి, కోశాధికారి టి.రాముడు కోరారు. ఆదివారం ఉదయం 10 గంటలకు రాజేశ్వరరావు పార్క్ వద్ద ప్రదర్శన ప్రారంభమవుతుందని చెప్పారు. మెయిన్ రోడ్డు, బోసు బొమ్మ జంక్షన్ మీదుగా వెంకటేశ్వర కళ్యాణ మండపం వరకు ర్యాలీ సాగుతుందని తెలిపారు. అనంతరం కళ్యాణ మండపంలో మహాసభ జరుగుతుందని తెలిపారు. మహాసభలో రాష్ట్ర కార్యదర్శి ఉరుకూటి రాజు, ఉపాధ్యక్షులు టి.నూకరాజు, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. జిల్లాలోని మున్సిపల్ కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విఆర్‌ఎల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-మక్కువ

విఆర్‌ఎ సమస్యలు పరిష్కరించాలని ఇన్‌ఛార్జి ఆర్‌ఐ శ్రీనివాసరావుకు ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి కృష్ణారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.పవన్, డి.సింహాచలం ఆధ్వర్యంలో వినతి అందించారు. ఈ సందర్భంగా విఆర్‌ఎలకు పేస్కేల్ అమలు చేయాలని, అర్హత ఉన్న వారికి విఆర్‌ఒలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. అటెండర్, నైట్ వాచ్‌మేన్ ప్రమోషన్ కోటాను 20 శాతం నుండి 70 శాతానికి పెంచాలని విజ్ఞప్తిచేశారు. అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని కోరారు. సెప్టెంబర్ 13, 14వ తేదీల్లో పాలకొండలో జరిగే సిఐటియు జిల్లా మహాసభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మహాసభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిర్మల, కాంతమ్మ, రాధ, ఈశ్వరరావు, ప్రసాద్, కాశయ్య పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు
2 గంటలపాటు నిలిచిన వాహనాలు



స్వామినాయుడువలస రైల్వేగేటు వద్ద నిలిచిపోయిన వాహనాలు

ప్రజాశక్తి-కొమరాడ

ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా స్వామినాయుడు వలస రైల్వేగేట్ వద్ద శనివారం ట్రాక్ మరమ్మతులు చేపట్టడంతో భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఆంధ్రా-ఒడిశా అంతర్రాష్ట్ర రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సుమారు రెండు గంటల పాటు ట్రాక్ మరమ్మతులు చేపట్టడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడ్డారు. ఉద్యోగులు కార్యాలయాలకు, విద్యార్థులు విద్యాసంస్థలకు సమయానికి చేరుకోలేక పోయారు. అంబులెన్స్ సేవలు కొంత ఇబ్బంది పడుతూ కుమ్మరిగుంట మీదుగా విక్రాంపురం నుంచి పార్వతీపురం వరకు అదనపు దూరంతో ప్రయాణాలు సాగించాయి. రైల్వే అధికారుల తీరుపై ప్రయాణికులు దుమ్మెత్తిపోశారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా పనులెలా చేస్తారని నిలదీశారు.

కార్మికులకు చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

అసంఘటిత కార్మికులకు చట్టాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో అసంఘటిత కార్మికుల సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అసంఘటిత రంగం, అనధికారిక రంగంలో ఎక్కువగా గ్రామీణ కార్మికులు, పట్టణ కార్మికులు ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాయని తెలిపారు. అసంఘటిత కార్మికులకు వివిధ చట్టాలు, పథకాలు, సామాజిక భద్రతా ప్రయోజనాల గురించి అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. సామాజిక భద్రతా చట్టాలు, ఇ-శ్రమ్ కార్డ్ ప్రయోజనాలు, ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్-ధన్ పెన్షన్ పథకాలు, జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ అందించే న్యాయ సలహాల అంశాలపై సమగ్రంగా కార్మికులకు అవగాహన కల్పించారు. కార్మికశాఖలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి సవివరంగా తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా జిల్లాలో ఎంతమంది కార్మికులు లబ్ధి పొందుతున్నారో ఆరాతీశారు. కార్మిక వేతన సవరణ చట్టం, హక్కులు, బాధ్యతల గురించి జడ్జి కార్మికులకు తెలిపారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 15100కు ఫోన్ చేసి న్యాయ సలహాలను పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ పి.సువర్ణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.కొండలరావు, లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, అప్‌హోల్డ్ స్వచ్ఛంద సంస్థ నుంచి ఎస్.సత్యనారాయణ, వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

డిఇఇగా నాగేశ్వరరావుకు ఉద్యోగోన్నతి



ప్రజాశక్తి - కురుపాం :

పంచాయతీరాజ్ మండల ఇంజినీరింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న పి.నాగేశ్వరరావుకు పార్వతీపురం డిఇఇగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుదీర్ఘ కాలంగా పనిచేసి, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనులు చేపట్టానని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ పరంగా అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యాయని చెప్పారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



నిరసన చేపడుతున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

బస్సు సౌకర్యం కల్పించాలని నిరసన

ప్రజాశక్తి-కొమరాడ

మారుమూల గిరిజన గ్రామాలకు బస్సు సర్వీసు నడిపి, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని శనివారం కూనేరు సంతలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యాన గిరిజన మహిళలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ ఐదు గిరిజన పంచాయతీలకు బస్సు సౌకర్యమే లేకపోవడం అన్యాయమన్నారు. పార్వతీపురం నుండి కూనేరు నైట్ హాల్ట్, లంజి గ్రామం వరకు బస్సు వెంటనే వెయ్యాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం నాయకులు జనార్ధన, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివున్నాయుడు, గిరిజన సంఘం నాయకులు గంగరాజు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీలో సహకరించండి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీలో బిఎల్‌ఒలకు సహకరించాలని కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎన్.చిన్నారావు.. రాజకీయ పక్షాల ప్రతినిధులను కోరారు. ఓటరు ఒక నియోజకవర్గంలోనే నమోదై ఉండాలని, పలు చోట్ల నమోదు కారాదని చెప్పారు. ఓటరు వేరే ప్రాంతానికి బదిలీ అయితే, తన ఓటు హక్కును కూడా బదిలీ చేసుకోవాలని స్పష్టం చేశారు. తద్వారా డూప్లికేట్ ఓటర్ల సమస్య ఉండబోదని, ఇందుకు బిఎల్‌ఒలు జాగ్రత్తలు పాటిస్తారని చెప్పారు. రాజకీయ పక్షాలు తమ పరిధిలోని ఓటర్ల నమోదు ప్రక్రియలో డూప్లికేషన్ జరగకుండా తగిన సూచనలు చేయాలన్నారు. శనివారం డిఆర్‌ఒ ఛాంబరులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎఒ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ప్రతి నెలా సమావేశాలు ఉంటాయని, అప్పటివరకు రాజకీయ పక్షాల దృష్టికి వచ్చిన విషయాలను డిఇఒ లేదా ఇఆర్‌ఒ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి నెల ఇవిఎం గోదాముల వెలుపల, త్రైమాసికంలో రాజకీయ పక్షాల సమక్షంలో గోదాముల లోపల ఇఆర్‌ఒ, డిఇఒ తనిఖీ చేస్తున్నట్లు వివరించారు. పోలింగ్ బూత్‌లో 800 నుంచి 1200 మంది ఓటర్లు ఉండేలా, ఓటరు నివాసం నుంచి 2 కిలోమీటర్ల దూరంలో పోలింగ్ కేంద్రం ఉండేలా హేతుబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సంబంధించి పోలింగ్ కేంద్రాలను విలీనం చేయడం/ఓటర్లను సమీప పోలింగ్ కేంద్రాలకు మార్చడం ద్వారా వివరణాత్మక కసరత్తు చేపట్టాల్సి ఉందన్నారు. రాజకీయ పక్షాలు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ఆవశ్యకతను గమనించిన ప్రాంతాలను ఇఆర్‌ఒలు, జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్నికల సంఘం బూత్ లెవల్ ఏజెంట్ల ఫొటోగ్రాఫ్, మొబైల్ నంబర్‌ను చేర్చడానికి ఫారం బిఎల్‌ఎ-2కు కొన్ని సవరణలు చేసిందన్నారు. బూత్ లెవల్ ఏజెంట్ల భవిష్యత్తు నియామకాలకు ఈ సవరించిన ఫారం తప్పనిసరిగా ఉపయోగించబడుతుందని నిర్ధారించుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో రాజకీయ పక్షాల ప్రతినిధులు జి.శివ, అల్లూరి పేర్రాజు, పైలా శ్రీనివాస రావు, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

25న ఆటో డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి-కొమరాడ

ఈ నెల 25న కొమరాడలో చేపట్టే ఆటో డ్రైవర్ల ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి, ఆటో యూనియన్ నాయకులు బి.గోపి కోరారు. శనివారం కొమరాడలో శ్రీ మజ్జి గౌరమ్మ తల్లి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డు తక్షణమే ఏర్పాటు చేసి, 25 వేల రూపాయల ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం అమలు చేయడంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం తక్షణమే వాహన మిత్ర కింద రూ.25 వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు శివ, రమేష్, ఆనంద్, మణి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

స్థానిక సబ్ జైల్‌ను అదనపు జడ్జి జె.సౌమ్య జోసెఫిన్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. జైలులో వసతులను పరిశీలించి, ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి పరిస్థితుల పట్ల ఆరా తీశారు. నాణ్యమైన ఆహారం అందుతుందా? లేదా? అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఆదేశించారు. చక్కటి నడవడిక, నైతిక విలువల వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తిచేసుకోవాలని జడ్జి సూచించారు. జైలు రికార్డులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. జైలు లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ను తనిఖీ చేశారు. జైలులోని పలు విభాగాలను పరిశీలించారు. ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ గురించి ఖైదీలకు వివరించారు. ఖైదీల ఆరోగ్యం కోసం తీసుకుంటున్న చర్యలను న్యాయమూర్తి.. జైల్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. 70 ఏళ్లు పైబడిన ఖైదీలకు, అనారోగ్యంతో బాధపడేవారికి బెయిల్ మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-సీతానగరం

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి కె.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గుచ్చిమి గ్రామంలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 ఇళ్ల నిర్మాణాల్లో జాప్యమవుతోందని, ఈ పనులకు ప్రభుత్వం అదనంగా రూ.50 వేలు మంజూరు చేసిందని తెలిపారు. లబ్ధిదారులు పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఇఒపిఆర్‌డి కెకెకె వర్మ, హౌసింగ్ ఎఇ సిహెచ్ జానకిరామ్, గుచ్చిమి కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు బోరాడ చిరంజీవి పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లోవ ముఠా ప్రాంతం గొరడ, దేరువాడ గ్రామాల నుంచి గుమ్మలక్ష్మీపురం గ్రామానికి ఆర్‌టిసి బస్సు నడపాలని బిజెపి మండల అధ్యక్షులు కద్రక అప్పలస్వామి ఆధ్వర్యాన ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి ప్రజాదర్బార్‌లో శనివారం వినతి అందించారు. వివిధ పనుల నిమిత్తం తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలకు వస్తున్న గిరిజనుల రాకపోకలకు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పార్వతీపురం డిపో నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. తాగునీరు, పింఛన్లు తదితర సమస్యలపై వినతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కురుపాం ఎఎంసి చైర్‌పర్సన్ కద్రక కళావతి, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా సైన్స్ అధికారి లక్ష్మణరావు, డిప్యూటీ డిఇఒ రామ్మోహనరావు ఆకాంక్షించారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా సీతంపేట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో స్పేస్‌కు సంబంధించిన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల డ్రాయింగ్, ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రయోగాల పనితీరును వారు అడిగి తెలుసుకున్నారు. కొన్ని సూచనలు ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు వసంతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎఎంఒ కోటిబాబు, హెచ్‌డబ్ల్యుఒ పాలక అమల, ఉపాధ్యాయులు ముద్దులమ్మ, రోజలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-మక్కువ


మరమ్మతులు చేపడుతున్న అధికారులు

మేజర్ పంచాయతీలో తాగునీటి సమస్యను పరిష్కరించేలా శనివారం చర్యలు చేపట్టినట్లు ఇఒ బెహరా శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం గ్రామంలోని పలువురు మహిళలు తాగునీటి సమస్యపై నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ జోగారావు నాయుడుతో సమన్వయం చేసుకుంటూ సమస్యను పరిష్కరించినట్లు ఇఒ తెలిపారు.

రామానగరంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో గారపాడు పంచాయతీ పరిధిలోని రామానగరంలో వైసిపి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తీరును వైసిపి నాయకులు ఎండగట్టారు. హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎస్‌టి సెల్ జిల్లా కన్వీనర్ మోహన్‌రావు, నియోజకవర్గ కన్వీనర్ నిమ్మక కాంతారావు, సాయికుమార్, ఎంపిటిసి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని చినబోగిలి, పెదబోగిలి పంచాయతీల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను శనివారం ఎంపిడిఒ ఎంఎల్ఎన్ ప్రసాద్ పరిశీలించారు. ఈ కార్యక్రమం ద్వారా అన్ని పంచాయతీల్లో మురుగునీటి కాలువల్లో పూడికతీత, తాగునీటి బావుల వద్ద చెత్తాచెదారం వంటి తొలగింపు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కెకెకె వర్మ, సర్పంచ్ కె.రాధా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పి.తిరుపతిరావు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన మహిళలు ఉత్సాహంతో కోలాటం నేర్చుకుంటున్న నేపథ్యంలో వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో శనివారం మాజీ ఎంపిటిసి దాసరి నాగరత్నం ఏకరూప దుస్తులు, చీరలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మనపల్లి సత్యవతి, ఎంపిటిసి తుమ్మనపల్లి పార్వతి, వైసిపి నాయకులు సిహెచ్.సురేష్, ఎం.వెంకటరమణ, సిహెచ్ లక్షణ పాల్గొన్నారు.

నిరాశ్రయుల వసతిగృహానికి వితరణ

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

ఆంధ్రరాష్ట్ర తొలిముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ కొమిరి కృష్ణమూర్తి.. శనివారం పట్టణంలోని ఐఆర్‌పిడబ్ల్యుఎ సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతిగృహానికి కిరాణా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తికి నిరాశ్రయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సిబ్బంది వై.గణేష్, జి.జాని పాల్గొన్నారు.


కిరాణా సామగ్రి అందజేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి

రైతులు, వికలాంగుల్లో ఆందోళన

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలోని రైతులు, వికలాంగులు, విద్యుత్ వినియోగదారుల్లో ఆందోళన పెరుగుతోంది. ఓవైపు భారాలు, మరోవైపు సంక్షేమం కోత పెడితే ఎలా బతుకుతామని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే యూరియా కొరతపై రైతులు ఎక్కడికక్కడ ఆందోళనకు దిగుతుండగా, తమకు పింఛన్లు తొలగించడం అన్యాయమంటూ రోడ్లెక్కేందుకు వికలాంగులు సిద్ధమౌతున్నారు. రకరకాల సాకులతో ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలూ తమకు పెనుభారంగా పరిణమించాయంటూ విద్యుత్ వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అనర్హత పేరిట వికలాంగుల పింఛన్ల తొలగింపునకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో 7వేల మంది పింఛన్లకు అనర్హులంటూ నోటీసులు జారీ చేశారు. ఇందుకోసం సదరం సర్టిఫికెట్ల పరిశీలన పేరిట 8నెలలుగా ఆస్పత్రుల చుట్టూ తిప్పించారు. వికలాంగత్వం 40శాతం కన్నా తక్కువ ఉందంటూ ఆయా నోటీసుల్లో పేర్కొన్నారు. ఇందులో చాలా మంది పదేళ్లకుపైగా పింఛన్లు తీసుకుంటున్నవారూ ఉన్నారు. పోలియోతో అంగవైకల్యానికి గురైనవారు కూడా ఉన్నారు. ప్రభుత్వం ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలన్న దృష్టితో వైద్యుల మెడపై కత్తిపెట్టిందని, వైద్యులు తమ వైకల్యాన్ని తగ్గిస్తూ సరిఫికెట్లు జారీచేశారని చాలా మంది వికలాంగుల వాదన. ప్రభుత్వమూ, ఇందులో భాగంగావున్న వైద్యులు తమ కడుపుకొడుతున్నారని చాలా మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా తొలగింపు నోటీసులు అందుకున్నవారికి వచ్చేనెల నుంచి ఫించన్లు అందేందుకు అవకాశం లేదు. దీంతో, ఇప్పటికే వికలాంగులు కొన్నిచోట్ల నిరసన తెలుపుతున్నారు. 1వ తేదీ తరువాత వీరంతా రోడ్లపైకి వచ్చే అవకాశం లేకపోలేదు. వికలాంగులకే అన్యాయం చేసిన ప్రభుత్వం తమ వరకూ రాకపోతుందా? అంటూ వృద్ధులు, దీర్ఘకాలిక రోగాల వల్ల పింఛన్లు



తీసుకుంటున్న రోగులు, ఇతర కేటగిరీలవారు ఆందోళన చెందుతున్నారు. వీరంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారితే అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

మరోవైపు ఈ ఏడాది వాతావరణం అనుకూలించినప్పటికీ ప్రభుత్వం నుంచి అందుకు తగ్గ సహకారం లేదు. పంట రుణాలు ఎలాగూ లక్ష్యానికి అనుగుణంగా ఇవ్వలేదు. చాలా మందికి అన్నదాత సుఖీభవ పథకం అమలు కాలేదు. అప్పుసప్పోచేసి మదుపు పెట్టుకుందామనుకుంటే యూరియా అందుబాటులో లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం.... ప్రస్తుతం వివిధ పంటల సీజనల్ కండీషన్ బట్టి జిల్లా వ్యాప్తంగా 32,600 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఆగస్టు ప్రారంభం నాటికి వచ్చింది కేవలం 24,360 మెట్రిక్ టన్నులు మాత్రమే. దీన్నిబట్టి 8,240 మెట్రిక్ టన్నుల కొరత ఉన్నట్టుగా స్పష్టమౌతోంది. ఈ సంగతి అటుంచితే... జిల్లాకు వచ్చిన యూరియాలో 50శాతం అంటే దాదాపు 12,180 మెట్రిక్ టన్నుల వరకు ప్రైవేటు డీలర్లకు వెళ్లింది. మిగిలిన 50శాతం మార్కెఫెడ్ ద్వారా 30శాతం రైతు సేవా కేంద్రాలకు, 20శాతం పిఎసిఎస్‌లకు తరలించి రైతులకు పంపిణీ చేశారు. రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్‌లలో స్థానిక రాజకీయ నాయకుల పెత్తనం పెచ్చుమీరడంతో తమ వరకు రావడం లేదని రైతుల వాదన. మొత్తంగా యూరియా లోటును ఆసరాగా చేసుకున్న ప్రైవేటు వ్యాపారులు పురుగుల మందులు కొంటేనే యూరియా విక్రయిస్తామంటూ మెలికపెట్టడంతో కొనలేక, వ్యవసాయం మానుకోలేక సతమతమౌతున్నామని వాపోతున్నారు. చివరకు అప్పులు చేసి మరీ అవసరం లేని పురుగుల మందులను కూడా కొనుక్కోవాల్సివస్తోందని రైతుల టాక్. మరోవైపు కొరత నేపథ్యంలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. విత్తనాల పంపిణీ, నీటి విడుదల సమయంలో ఫొటోలకు ఫోజులు ఇస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు ఇప్పుడు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత.. మనందరి బాధ్యత

జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వర్షాకాలంలో ఎక్కువగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటి నివారణ చర్యల పట్ల అవగాహన పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ● సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి పాల్గొని, పరిసరాలను శుభ్రం చేశారు.


సీతంపేట.. చెత్త ఏరుతున్న ఐటిడిఎ పిఒ జగన్నాథ్



గుమ్మలక్ష్మీపురం.. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జగదీశ్వరి


పార్వతీపురం.. చీపురుపట్టి శుభ్రం చేస్తున్న సబ్‌కలెక్టర్ వైశాలి

●పార్వతీపురం మండలంలోని నర్సిపురంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ సుధారాణి, ఎఎంసి చైర్ పర్సన్ గొట్టాపు గౌరి, తహశీల్దార్ సురేష్ పాల్గొన్నారు. ●సీతంపేటలో ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యాన ర్యాలీ చేపట్టారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. ఎపిఒ చినబాబు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి, సర్పంచ్ అరిక కళావతి, ఎంపిడిఒ కొండపల్లి సత్యం పాల్గొన్నారు. ● పాలకొండ కోర్టు ఆవరణలో జడ్జి హరిప్రియ ఆధ్వర్యంలో సిబ్బంది, న్యాయవాదులు శుభ్రం చేశారు. ● గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఇరిడి గ్రామంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆధ్వర్యాన స్వచ్ఛాంధ్ర ర్యాలీ చేపట్టారు. ఎఎంసి చైర్‌పర్సన్ కద్రక కళావతి, తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి బిడ్డిక పద్మావతి, టిడిపి మండల కన్వీనర్ అడ్డాకుల నరేష్, ఎంపిడిఒ త్రివిక్రమ్ రావు, ఎంఇఒ చంద్ర శేఖర్ పాల్గొన్నారు. ● వీరఘట్టం మేజర్ పంచాయతీ ఇఒ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ●కురుపాంలో ఇఒ సురేష్‌కుమార్ ఆధ్వర్యాన నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎంపిడిఒ నాగభూషణరావు, ఉప సర్పంచ్ ఆదిల్ పాల్గొన్నారు. ●సాలూరు మండలంలోని మామిడిపల్లిలో ఎంపిడిఒ ఆధ్వర్యాన చేపట్టిన స్వచ్ఛాంధ్ర ర్యాలీలో మండల ప్రత్యేక అధికారి జె.రామారావు, ఇన్‌ఛార్జి డిఇఒ రాజకుమార్, తహశీల్దార్ నీలకంఠరావు, సర్పంచ్ శశికళ పాల్గొన్నారు.


ప్రజలకు చేరువగా అధునాతన వైద్యం

డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-పార్వతీపురం

పిల్లల మెరుగైన ఆరోగ్యం కోసం వైద్యారోగ్యశాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు తెలిపారు. ప్రజలకు అధునాతన వైద్యం చేరు చేసినట్లు చెప్పారు. ఎన్‌హెచ్‌ఎం, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాంలో భాగంగా జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రంలో శనివారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. విశాఖపట్నం, మెడికవర్ హాస్పిటల్స్ నుండి విచ్చేసిన పిల్లల గుండె వైద్య నిపుణులు ఎ.అశోక్‌రాజు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ అక్కడ వారి ఆరోగ్య పరీక్షల వివరాలు, ఆరోగ్య స్థితిగతులపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. 26 మందికి పరీక్షలు నిర్వహించగా, వారిలో నలుగురికి శస్త్ర చికిత్సలు, ముగ్గురికి కార్డియాక్ ఇంటర్వెన్షన్ కోసం మొత్తం ఏడుగురు బాలలను మెడికవర్ ఆసుపత్రి రిఫర్ చేస్తున్నామని చెప్పారు. వీరికి ఎన్‌టిఆర్ వైద్య సేవా పథకం ద్వారా చికిత్స అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌బిఎస్‌కె అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు, డిపిఎంఒ రఘుకుమార్, డిఇఐసి పిల్లల వైద్య నిపుణులు భరత్ చంద్ర, ఎపిడిమియాలజిస్ట్ కౌశిక్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గుండె వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావు


సమావేశంలో మాట్లాడుతున్న జిసిసి డిఎం రామారావు

అందుబాటులోనే సరుకులు పంపిణీ

జిసిసి జిల్లా మేనేజర్ రామారావు

ప్రజాశక్తి-సాలూరు రూరల్

గిరిజన గ్రామాల్లో అందుబాటులోనే నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని జిసిసి జిల్లా మేనేజర్ రామారావు డీలర్లను ఆదేశించారు. శనివారం సాలూరు జిసిసి కార్యాలయంలో డీలర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి అనుగుణంగానే వారికి ప్రతి నెలా నిత్యావసర సరుకులను అందించాలన్నారు. సమయానికి ఇవ్వకపోయినా, జిసిసి డిపోలో లేకపోయినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ లచ్చయ్య, జిసిసి సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

ఎస్‌ఐ మస్తాన్‌కు ప్రశంసలు

ప్రజాశక్తి-సీతంపేట



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఐ మస్తాన్

మండలంలో దోనుబాయి ఎస్ఐ షేక్ మస్తాన్‌ను ఎస్‌పి మాధవరెడ్డి ప్రశంసించారు. ఈ మేరకు మస్తాన్ చేసిన కృషిని అభినందిస్తూ జిల్లా మాసాంతర నేర సమీక్షలో ఆయనకు ప్రశంసాపత్రం అందించారు. కానిస్టేబుల్ రాంబాబును సైతం ఎస్‌పి అభినందించారు.

గట్లపై కందితో అదనపు ఆదాయం

ప్రజాశక్తి-పాచిపెంట

గట్లపై కంది పంటతో రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని ఎఒ కె.తిరుపతిరావు తెలిపారు. అందుకోసం ప్రభుత్వం ఉచితంగా కంది విత్తనాలు అందిస్తుందన్నారు. శనివారం మండలంలోని కర్రివలసలో రైతు కంది తవిటినాయుడు పొలంలో వరుసలో నాట్లు వేయిస్తూ, గట్ల మీద కంది విత్తనాలను నాటించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులు ఏకపంట విధానాన్ని వదిలి, అంతర పంటలు వేసుకుంటే అధిక దిగుబడితోపాటు అదనపు ఆదాయం కూడా వస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి సేద్య సిబ్బంది విజయ్, సుమలత పాల్గొన్నారు.

విద్యార్థులు పెడదోవ పట్టకూడదు

ఎస్‌పి మాధవరెడ్డి

ప్రజాశక్తి-సీతానగరం

విద్యార్థులు పెడదోవ పట్టకూడదని ఎస్‌పి మాధవరెడ్డి సూచించారు. మండలంలోని జోగుంపేట సాంఘిక సంక్షేమ గురుకుల ఆవరణలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే విద్యార్థులు సమాజం, వివిధ అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. ఎవరైనా చెడు వ్యసనాల బారిన పడితే వారికి దుష్ఫలితాలను వివరించి, చైతన్యం చేయాలని చెప్పారు. యువత ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా మంచి నడవడికతో ఉన్నత స్థాయిలో నిలవాలన్నారు. మాదకద్రవ్యాల నిరోధ, మహిళా రక్షణ చట్టాలు, సైబర్ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి అంకిత సురాన, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ రాజారావు, వైద్యాధికారి ఉషారాణి, ఎంఇఒలు జి.సూరిదేముడు, వెంకటరమణ, సిఐ గోవిందరావు, ఎస్‌ఐలు ఎం.రాజేష్, కె.నీలకంఠం పాల్గొన్నారు.


ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్న అధికారులు

ఎరువులు దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలో బూర్జ, సీతానగరంలో ఎరువుల దుకాణాల్లో శనివారం తహశీల్దార్ జె.ప్రసాద్ కుమార్, ఎస్ఐ ఎం.రాజేష్, ఎఒ ఎస్.అవినాష్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రికార్డులను, గోదాముల్లో ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎరువుల దుకాణాల వద్ద నిల్వలను, ధరల పట్టికను ప్రదర్శించాలని తహశీల్దార్ సూచించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఒ అవినాష్ మాట్లాడుతూ మండలంలో మూడు రైతు సేవా కేంద్రాలకు, రెండు పిఎసిఎస్‌లకు యూరియా వచ్చినట్లు తెలిపారు.

అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కొమరాడ

జనసేన పార్టీ మండల అధ్యక్షులు అక్రమ వసూళ్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మరడాన సింహాచలం నాయుడు డిమాండ్ చేశారు. శనివారం కొమరాడలో విలేకరులతో ఆయన మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలోనే వికలాంగుల పింఛన్లు తొలగించడం చాలా దారుణమన్నారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు.. కుమ్మరిగుంట పంచాయతీలో సదరం సర్టిఫికెట్లు చేసి పింఛన్లు చేయిస్తామని రూ.30 వేలు చొప్పున వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. దీంతో కుమ్మరిగుంట పంచాయతీ చెందిన ఒక వ్యక్తి తన భార్య తాళిబొట్టును తాకట్టు పెట్టి మరి జనసేన మండల అధ్యక్షుడికి ఇచ్చినట్లు ఒక ఆడియో రికార్డింగ్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అక్రమ వసూళ్లపై చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కలింగ మల్లిబాబు, జిల్లా యువజన నాయకులు నంగి రెడ్డి శరత్ బాబు, విక్రమపురం ఉపసర్పంచ్ సిరిపురపు రామకృష్ణ, కుమ్మరిగుంట మాజీ సర్పంచ్ కెంగువ పోలినాయుడు, నాయకులు మరడాన సూరపనాయుడు, చిన్న సుధా, సింహాచలం పాల్గొన్నారు.

కడకెల్లలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని నడిమికెళ్ల సచివాలయ పరిధి కడకెల్ల గ్రామంలో శనివారం వైద్యాధికారి సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణులు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నివారణకు పిచికారీ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మున్సిపల్ పరిధిలో ఉన్న పలు వార్డుల్లో దోమల నియంత్రణకు శనివారం ప్రజారోగ్య అధికారి కె.వెంకట పకీరు రాజు ఆధ్వర్యాన మలాథిన్ పిచికారీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఎండిఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-సీతానగరం

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. శనివారం సీతానగరంలో ఎండిఎం కార్మికుల సంఘం మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వాహకులు అరకొర వేతనాలతో పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో సొంత డబ్బులు పెట్టుకుని, అప్పులు తెచ్చి పెట్టుబడులు పెడుతున్నారని చెప్పారు. అయినా సకాలంలో వంట బిల్లులు అందడం లేదన్నారు. దీనికి తోడు ప్రభుత్వం ప్రయివేటు సంస్థలకు వంట నిర్వహణను అప్పగించి వారి పొట్ట కొట్టాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వీరికి కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల కమిటీని 18 మందితో ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా పి.సావిత్రి, వై.శాంతికుమారి, సభ్యులుగా పి.గౌరమ్మ, డి.కృష్ణవేణి, సిహెచ్.ఆదిలక్ష్మి, సనపతి రాధమ్మ, సురపాటి పద్మ, పెంకి ఉష, మరిశర్ల సత్యవతిని ఎన్నుకున్నారు.


పారిశుధ్య లోపం లేకుండా చర్యలు

ప్రజాశక్తి - కురుపాం

పంచాయతీల్లో పారిశుధ్య లోపం లేకుండా కార్యదర్శులు చర్యలు చేపట్టాలని డిపిఒ కొండలరావు సూచించారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం స్వర్ణ పంచాయతీ, స్వమిత్వపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు కీలక బాధ్యత వహించి, సర్వే చేపట్టాలన్నారు. దీని ద్వారా గ్రామాల్లో కచ్చితమైన గ్రామ, ఇళ్ల సరిహద్దుల వివరాలు నమోదు చేయవచ్చని చెప్పారు. తద్వారా ఆస్తి తగాదాలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వై.వెంకట నాయుడు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హిందీ భాషాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పాలకొండ


కేంద్రమంత్రికి వినతి అందిస్తున్న శివానంద్

హిందీ భాషాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎపి హిందీ ప్రచార సభ సభ్యులు చొంగ శివానంద్.. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు శనివారం ఢిల్లీలో వినతి అందించారు. రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించారని శివానంద్ తెలిపారు. అనంతరం కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్, తదితరులను కలిసి వినతులు అందించారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

డిగ్రీలో వివిధ గ్రూపుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.శ్రీవరం తెలిపారు. అర్హులైన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కళాశాలలో బిఎ- పొలిటికల్ సైన్స్ మేజర్ -ఎకనామిక్స్ మైనర్, బికాం- కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎస్‌సి బోటనీ మేజర్ -కెమిస్ట్రీ మైనర్, బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ మేజర్ -మాథ్స్ మైనర్ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వంశధార నదిలో మహిళ గల్లంతు

ప్రజాశక్తి -భామిని


కుమ్మరి లక్ష్మి (ఫైల్)

మండలంలోని లివిరి గ్రామం వద్ద వంశధార నదిలో శనివారం కుమ్మరి లక్ష్మి (35) గల్లంతైంది. స్థానికుల కథనం ప్రకారం.. వంశధార నదికి లివిరి గ్రామానికి చెందిన కుమ్మరి లక్ష్మి స్నానానికి వెళ్లింది. అనంతరం ఇంటికి నీరు తీసుకొచ్చేందుకు బిందెతో నదిలో దిగగా మెట్ల నుంచి జారి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. ఈ విషయం తెలుసుకున్న తహశీల్దార్ శివన్నారాయణ, బత్తిలి ఎస్ఐ జి.అప్పారావు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కొత్తూరు నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం సాయంత్రం వరకు ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం ఉదయం మరలా గాలింపు చర్యలు చేపడతామని బత్తిలి ఎస్ఐ తెలిపారు.